## టెన్త్‌ఎగ్జామ్ సెంటర్లో సీసీ కెమెరాల దొంగతనం

శ్రీకాకుళం రణస్థలం మండలం పైడిభీమవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎనిమిది గదులలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఆ కెమెరాలను చోరీ చేశారు. ఈ విషయమై ఉపాధ్యాయులు చుట్టూ పక్కల ఆరా తీసినా.. సీసీ కెమెరాలు ఎవరు తీశారన్నది తేలలేదు. దీనిపై సీఎస్ జగన్నాథరావు జె.ఆర్ పురం పిఎస్ లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎస్. చిరంజీవి తెలిపారు.

# విభారే
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY

ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
రి.నెం. 119/2015
ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా
ఉచిత కళ్యాణ మండపం
స్వయం ఉపాధి శిక్షణ
ఉచిత రక్తదానము
ఉచిత న్యాయ సలహాలు
ఉచిత కంప్యూటర్ శిక్షణ
సంప్రదించవలసిన చిరునామా
అధ్యక్షులు ఆవుల విజయభాస్కర రెడ్డి అడ్వకేట్,B.A.L.L.B
ఆళ్లగడ్డ
9440232308,9494498787

PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి ఆదివారం 23-03-2025 సంపుటి : 06 సంచిక : 313 పేజీలు : 8 వెల : రూ 1-00

# వారిపై కఠినంగా ఉండాలి..

## డీజీపీకి సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు



అమరావతి: తూర్పు గోదావరి జిల్లాలోని నల్లజర్ల మండలంలో గల దూబచర్లగాంధీ కాలనీలో రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహాన్ని అవమానించిన ఘటనను ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఖండించారు. ఈ ఘటనపై ఏపీ డీజీపీ హరీశ్ కుమార్ గుప్తాతో ఇవాళ(శనివారం) రాష్ట్ర సచివాలయంలో సమీక్ష చేశారు. నిందితులపై కఠిన చర్యలకు ఆదేశించారు. భారతరత్న అంబేద్కర్‌ను అగౌరవపరిచేలా విగ్రహం పట్ల దుశ్చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డీజీపీకి సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు.ఈ ఘటనపై డీజీపీ, పోలీస్ ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడారు. ఈ ఘటనపై పూర్తి వివరాలను సీఎం చంద్రబాబుకు డీజీపీ తెలిపారు. ఈ ఘటనలో కుట్ర కోణాన్ని వెలికి తీయాల్సిందిగా డీజీపీని ఆదేశించారు. దీనిపై దర్యాప్తు ప్రారంభించినట్లు సీఎంకు డీజీపీ తెలిపారు. నిందితులను గుర్తించి అరెస్టు చేసేందుకు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేసినట్లు సీఎంకు వివరించారు. వర్గాల మధ్య విద్వేషాలు రగిల్చేలా కుట్ర చేసిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే ప్రయత్నం చేస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని సీఎం చంద్రబాబు హెచ్చరించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని సీఎం చంద్రబాబు కోరారు. పోలీసులు మరింత అప్రమత్తంగా ఉండాలని, వివిధ వర్గాల మధ్య వైషమ్యాలు రెచ్చగొట్టే వారిపై నిఘా ఉంచాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు.

# ఆ విజయానికి కారణం చంద్రబాబే



కర్నూలు, మార్చి 22: రాష్ట్ర వ్యాప్తంగా 1.55 లక్షల ఫారం పాండ్ నిర్మాణంలో భాగంగా ఓర్వకల్లు మండలం పూడిచెర్ల గ్రామంలో రైతు రాజన్న పొలంలో ఫాం పాండ్ నిర్మాణ పనులకు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ భూమి పూజ చేశారు. అనంతరం పూడిచెర్లలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. దేశం మొత్తం ఏపీ వైపు చూస్తోందన్నారు. కష్ట సమయంలో కూటమిని గెలిపించారని.. 175 సీట్లలో 164 సీట్లు కూటమికి ఇచ్చారన్నారు. ఎన్డీయే కూటమిని 21 ఎంపీ స్థానాల్లో గెలిపించారని తెలిపారు. ఏపీ వ్యాప్తంగా పల్లె పండుగ విజయవంతం కావడానికి అనుభవజ్ఞుడైన చంద్రబాబే కారణమన్నారు. రాష్ట్రం బాగుండాలని సీఎం చంద్రబాబు కోరుకుంటారని.. ముఖ్యమంత్రి స్ఫూర్తితోనే తాను పనిచేస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.జాతీయ ఉపాధి హామీ పథకానికి ప్రధానంగా కావాల్సింది కష్టపడి పనిచేయడమే అని తెలిపారు. రాయలసీమలో నీటి కష్టాలు అధికంగా ఉండేదన్నారు. భారీ వర్షాలు పడితే నీటి నిల్వ సౌకర్యం రాయలసీమలో లేదన్నారు. మే నెలలోపు లక్షా 55 వేల నీటి కుంటలు పూర్తి అవ్వాలనేది లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. వర్షాల సమయంలో లక్షా 55 వేల నీటి కుంటలు నిండితే ఒక టీఎంసీ నీళ్లు వస్తాయన్నారు. శ్రీకృష్ణదేవరాయలు చెప్పినట్లు రాయలసీమ రతనాల సీమ అవ్వాలన్నారు. అభివృద్ధి కొందరికే పరిమితం కాదని.. అందరికీ కావాలన్నారు. ఒకే రోజు 13326 పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించామని చెప్పుకొచ్చారు. పని చేసే సత్తా ఉందని.. పని కోసం దిశానిర్దేశం చేసే ఏ స్వార్థం లేని వ్యక్తులు కావాలన్నారు. రాష్ట్రం బాగుండాలని సీఎం కోరుకున్న విధంగా.. ఆయనను ప్రేరణగా తీసుకుని తనకు ఇచ్చిన శాఖలను బలంగా చేయాలని ఒకే రోజు 13326 గ్రామసభలు నిర్వహించి.. అభివృద్ధి కోసం చేపట్టాల్సిన పనుల జాబితాను రూపొందించి ప్రపంచ రికార్డు సాధించామన్నారు.పంచాయతీరాజ్ పరిపాలనా వ్యవస్థను మరింత సమర్థవంతంగా మార్చేందుకు మంత్రివర్గం పరిపాలనా సంస్కరణలను ఆమోదించిందన్నారు. గ్రామీణ ప్రజల జీవితాన్ని మెరుగుపరిచేం దుకు మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని తీసుకొచ్చామన్నారు. రాష్ట్రంలో 52.92 లక్షల కుటుంబాల్లో 97.44 లక్షల మందికి ఉపాధి కూలీలకు స్వగ్రామాల్లో ఉపాధి కల్పించామన్నారు. ఈ పథకం కింద రూ.9.5 కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పారు. ప్రజలకు ఉపాధి ఆర్థికత స్థిరత్వం కల్పించేందుకు చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఒక అడుగు ముందే ఉంటుందన్నారు.గత ప్రభుత్వ హయాంలో ఐదేళ్లలో 4వేల పైచిలుకు రోడ్లు మాత్రమే నిర్మించారని, ఎన్డీఏ ప్రభుత్వం వచ్చిన ఎనిమిది నెలల్లోనే దాదాపు 4వేల కిలోమీటర్ల రోడ్ల నిర్మాణం జరిగింది. రూ.1600 కోట్ల వ్యయంతో రోడ్లను నిర్మించినట్లు చెప్పారు. 100 మందికి పైగా ఉన్న గిరిజన గ్రామాల్లో రహదారి సౌకర్యం కల్పించామన్నారు. గిరిజన గ్రామాల్లో విద్యుత్, తాగునీరుతో పాటు మౌలిక వసతులు కల్పించినట్లు తెలిపారు. లక్షా 55 వేల పంట కుంటలు నిండితే మనకు ఇబ్బంది ఉండదని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చెప్పుకొచ్చారు.

# ఆళ్లగడ్డలో కంప్యూటర్ కోర్స్ నందు ఉచిత శిక్షణ: ఆవుల పుల్లా రెడ్డి సేవాసమితి



ఆళ్లగడ్డ ::(విభారె న్యూస్) :: ఆళ్లగడ్డ పట్టణంలోని టీ.బి.రోడ్డు నందు గల ఆవుల పుల్లారెడ్డి సేవాసమితి వారు కంప్యూటర్ ఉచిత శిక్షణా శిబిరం ప్రారంభించనున్నారు. ఆసక్తిగల విద్యార్థినీ, విద్యార్థులు ఈ అవకాశమును సద్వినియోగము చేసుకోవాలని ఆ సంస్థ అధ్యక్షుడు ఆవుల విజయ భాస్కరరెడ్డి తెలిపారు . ఆసక్తి గల విద్యార్థినీ విద్యార్థులు వెంటనే తమ పేరును ఆవుల పుల్లారెడ్డి సేవాసమితి యందు అప్లికేషన్ ద్వారా నమోదు చేసుకోగలరు. కంప్యూటర్ నందు శిక్షణ పొందగోరు వారు ఇంటర్మీడియట్ మరియు ఆ పై తరగతులు చదివి ఉండవలెను. గత 10 సంవత్సరాల నుండి కంప్యూటర్ పూర్తిగా ఉచితంగా శిక్షణ అందిస్తున్నట్లు, శిక్షణ పూర్తయిన వెంటనే సర్టిఫికెట్ ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. ఇప్పటివరకు దాదాపు 1700 మంది పేద విద్యార్థులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ అందించినట్లు ఆయన తెలిపారు. 03-04-2025 నుండి కంప్యూటర్ శిక్షణ ప్రారంభమగును. శిక్షణ కొరకు దరఖాస్తులు తేదీ:23-03-2025 నుండి ఆవుల పుల్లారెడ్డి సేవాసమితి కార్యాలయం నందు ఉదయం 10 గంటల నుండి 12 గంటల వరకు, మరియు సాయంత్రం 5 గంటల నుండి 7 గంటల వరకు పొందగలరు. దరఖాస్తు చేసుకొను అభ్యర్థులు తమ పాస్ పోర్ట్ సైజు ఫోటో తీసుకొని రావలెను. దరఖాస్తులు వెంటనే పూర్తి చేసి కార్యాలయము నందు ఇవ్వవలెను. వివరముల కొరకు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు. 9440232308 - 95420 44106 - 78933 82336 - 94418 08737.

# ప్రధాని మోడీకి వైఎస్ జగన్ లేఖ

విజయవాడ,నియోజకవర్గాల పునర్విభజనపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి మాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైయస్ జగన్మోహన్‌రెడ్డి లేఖరాసారు. సదరు లేఖను వైయస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీనేత వైవీ సుబ్బారెడ్డి డీఎంకే నాయకులకు పంపించారు.లోక్సభ లేదా రాజ్యసభలో ఇప్పుడున్న సీట్ల పరంగా ఆయా రాష్ట్రాలకు ఉన్న వాటాను కుదించకుండా పునర్విభజన (డీలిమిటేషన్) కసరత్తు చేపట్టాలి. కొన్ని రాష్ట్రాల ప్రాతినిధ్యం సహా, ఆయా రాష్ట్రాల్లోని ప్రజల మనోభావాలను డీలిమిటేషన్ ప్రక్రియ ప్రభావితం చేసే అవకాశం ఉన్నందున ఈ లేఖ రాస్తున్నట్లు వెల్లడించారు. అందుకే డీలిమిటేషన్ ప్రక్రియను అత్యంత జాగ్రత్తగా చేయాల్సిన అవసరాన్ని ఆ లేఖలో వైయస్ జగన్ పేర్కొన్నారు.రాజ్యాంగంలో 84వ రాజ్యాంగ సవరణ ప్రకారం 2026లో డీలిమిటేషన్ ప్రక్రియను చేపట్టాల్సి ఉంది. కాని, దీనికి ముందుగా 2021లో చేపట్టాల్సిన జనాభా లెక్కింపు ప్రక్రియ కోవిడ్ కారణంగా వాయిదా పడింది. 2026 నాటికి జనాభా లెక్కల ప్రక్రియను పూర్తి చేయడానికి ఇప్పటికే అన్ని రకాల చర్యలు తీసుకున్నారు. ఇది జరిగిన వెంటనే డీలిమిటేషన్ ప్రక్రియ జరుగుతుందన్న ఊహ అనేక రాష్ట్రాల్లో తీవ్ర చర్చకు దారి తీస్తోంది. ముఖ్యంగా ఈ ప్రక్రియ ద్వారా తమ ప్రాతినిధ్యం తగ్గిపోతుందని దక్షిణాది రాష్ట్రాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. జనాభా నియంత్రణ కోసం వివిధ రాష్ట్రాలు అనేక విధానాలు అమలు చేశాయి. అయితే వాటి ఫలితాలు ఆయా రాష్ట్రాల్లో వేర్వేరుగా ఉన్నాయి. దీని వల్ల జనాభా పెరుగుదల వివిధ రాష్ట్రాల్లో వివిధ రకాలుగా ఉంది. దేశవ్యాప్తంగా జనాభా వృద్ధి ఒకే తరహాలో లేదు. అసమతుల్యత ఉంది. దీని వల్ల డీమిలిటేషన్ అంశం విస్తృతస్థాయిలో ఆందోళనకు దారి తీస్తోంది. 42 మరియు 84వ రాజ్యాంగ సవరణల ద్వారా ఆయా రాష్ట్రాలకు సీట్ల కేటాయింపును నిలిపేశారు. కాలక్రమేణా అన్ని రాష్ట్రాల్లో జనాభా నియంత్రణ కసరత్తులో భాగంగా ఒకేస్థాయిలో ఫలితాలు సాధిస్తాయని భావించి ఈ సీట్ల కేటాయింపును నిలిపేశారు. దేశ జనాభాలో ఆయా రాష్ట్రాల వాటా 1971 నాటి స్థాయికి చేరుకుంటుందని భావించారు. కానీ, 2011 జనాభా లెక్కల గణాకాంలను చూస్తే దశాబ్దాల తరబడి జనాభా వృద్ధి, దాని అంచనాలు అన్ని రాష్ట్రాల్లో ఒకేలా లేవని తేలింది. 1971 మరియు 2011 మధ్య 40 సంవత్సరాల్లో దేశ జనాభాలో దక్షిణాది రాష్ట్రాల వాటా తగ్గింది. ఈ 15 సంవత్సరాల్లో మరింత తగ్గిందని మేం నమ్ముతున్నాం. . జనాభా నియంత్రణను జాతీయ ప్రాధాన్యతగా తీసుకున్నందున దక్షిణాది రాష్ట్రాలు నిజాయితీగా తమ విధానాలను అమలు చేయడం వల్ల ఈ వాటా తగ్గింది.

# జిల్లాలో దాదాపు 3 వేల నీటి కుంటల ఏర్పాటుకు శ్రీకారం

## జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మార్చి 22 - పంటకు అవసరమయ్యే నీటిని నీటి కుంటల ద్వారా సమకూర్చుకోవాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి రైతులను సూచించారు. శనివారం ప్రపంచ జల దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర వ్యాప్తంగా నీటి కుంటల ప్రారంభిస్తున్న సందర్భంగా మహానంది మండలం గాజులపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన పంట నీటి కుంటల కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. డ్వామా పిడి వెంకటసుబ్బయ్య తదితరులు కలెక్టర్ వెంట పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ రైతులు తమ పంట పొలాల్లో నీటి కుంటలను ఏర్పాటు చేసుకొని పంటలకు అవసరమయ్యే నీటిని నీటి కుంటల ద్వారా సమకూర్చుకోవాలని రైతులను సూచించారు. నీటి గుంటల కింద కూరగాయల సాగును కూడా చేపట్టవచ్చన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున నీటి కుంటలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో నంద్యాల జిల్లాలో 3 వేల వరకు నీటి కుంటలు ఏర్పాటు చేసే దిశగా లక్ష్యాన్ని నిర్దేశించారన్నారు. జిల్లాలో 1/3 వంతు భూములు ఉపరితలంగా ఉండడం, ఆర్ఓఎఫ్ఆర్ భూములు ఉన్న కారణంగా కమ్యూనిటీ ఫామ్ పాండ్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. దీంతో జిల్లాలోని రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. జిల్లాలో 3 మీటర్ల నుండి 25 మీటర్ల లోతు వరకు నీటి సాంద్రత ఉన్న గ్రామాలు ఉన్నందున మార్చి, ఏప్రిల్, మే మాసాల్లో పెద్ద ఎత్తున నీటి కుంటలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఉపాధి హామీ పనులకు హాజరయ్యే వేతనదారులు కూడా ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ఉదయాన్నే పనులకు త్వరగా వచ్చి ఉ.11 గంటల లోపు ముగించుకొని వెళ్లేలా తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఉపాధి హామీ వేతనదారులకు ప్రభుత్వం నుండి రావాలసిన సహాయ, సహకారాలు అందుతాయని కలెక్టర్ తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్ల సూచనల మేరకు ఉపాధి హామీ పనులు సక్రమంగా పూర్తి చేసిన వారికి రోజుకు మూడు వందల రూపాయల వరకు వేతనం రావడం జరుగుతుందన్నారు.

# రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిని మర్యాద పూర్వకంగా కలిసిన కర్నూల్ రేంజ్ డీఐజీ,జిల్లా ఎస్పీ.



విభారే న్యూస్ మార్చి 22 కర్నూలు జిల్లా ప్రతినిధి..రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ కర్నూలు జిల్లా, ఓర్వకల్లు మండలం, పూడి చెర్ల గ్రామ పరిధిలో ఉన్న ఒక రైతు పొలంలో ఫారం పాండ్ కు భూమి పూజ చేసి, బహిరంగ సభలో పాల్గొనేందుకు విచ్చేశారు.ఈ సందర్భంగా శనివారం కర్నూలు ఎయిర్పోర్టులో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిని కర్నూల్ రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ ఐపీఎస్,కర్నూల్ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కలను అందజేశారు. ఉప ముఖ్య మంత్రి పర్యటన ఏర్పాట్ల ను, భద్రతను కర్నూల్ రేంజ్ డీఐజీ,జిల్లా ఎస్పీ పరిశీలించారు.

# సంపాదకీయం

ఆదివారం 16-03-2025

## జల్లెడ పట్టి మరీ ఏరేస్తున్నారు...

ఐదు దశాబ్దాలుగా దేశంలో అతి పెద్ద శాంతిభద్రత సమస్యగా కొనసాగిన మావోయిస్టు ఉద్యమం చివరి దశకు చేరుకుందా? అవుననే అనిపిస్తోంది. 2026 మార్చి నాటికి 'మావోయిస్టు రహిత భారత్'గా దేశాన్ని మారుస్తామని గత ఏడాది కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఏ ఉద్దేశంతో ప్రకటించారో తెలియదు కానీ అప్పటినుంచి మావోయిస్టులకు స్థావరంగా ఉన్న బస్తర్ ప్రాంతంలో పెద్ద ఎత్తున మావోస్టులను ఏరివేస్తున్నారు. గురువారం ఒకే రోజు ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్, కాం కేర్ జిల్లాల్లో జరిగిన వేర్వేరు ఎన్‌కౌంటర్లలో పెద్ద సంఖ్యలో మావోయిస్టులు మృతి చెందినట్లుగా వార్తలు వస్తున్నాయి. ఈ ఎదురు కాల్పుల్లో ఓ జవాను కూడా చనిపోయినట్లు చెబుతున్నారు. గత ఏడాది ఛత్తీస్‌గఢ్‌లో బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వం ఏర్పాటయిన తర్వాత మావోస్టుల ఏరివేత ఉధృతమైంది.ఓ నివేదిక ప్రకారం ఈ ఏడాది జనవరి 22 నాటికి 344 మంది మావోస్టులు మృతి చెందగా ఒక్క ఛత్తీస్‌గఢ్‌లోనే 283 మంది చనిపోవడం గమనార్హం. ఛత్తీస్‌గఢ్‌లో ఈ ఏడాది చోటు చేసుకున్న అతిపెద్ద ఘటనల్లో తాజా ఎన్‌కౌంటర్ రెండోది. గత ఫిబ్రవరి 9న బీజాపూర్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 31మంది మావోయిస్టులు మృతి చెందారు. ఈ ఏడాది మూడు నెలల్లోనే దాదాపు 90 మంది నక్సల్స్ మృతి చెం దినట్లు అంచనా.వీరిలో పలువురు మావోయిస్టు అగ్రనేతలు కూడా ఉన్నారు. 2026 మార్చి చివరినాటికల్లా దేశాన్ని 'మావోయిస్టు రహిత భా రత్'గా మారుస్తామని అమిత్ షా ప్రకటించడం వెనుక పక్కా ప్రణాళిక ఉ న్నట్లు కనిపిస్తోంది. గత దశాబ్దకాలంగా ప్రభుత్వం తీసుకున్న చర్యల ఫలితంగా మావోయిస్టు ఉద్యమం గణనీయంగా బలహీనమయినట్లు అమిత్ షా చెబుతున్నారు.గత ఏడాది కాలంగా బస్తర్‌లో మావోయిస్టు కార్యకలాపాలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో పౌరులు, భద్రతా జవాన్ల మర ణాలు అతి తక్కువగా ఉన్న మాట వాస్తవమే. అదే సమయంలో పెద్ద సం ఖ్యలో మావోయిస్టు కేడర్, నేతలు పోలీసుల ఎదుట లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలిశారు. అయినా ఇంకా కొందరు మాత్రం లొంగి పోవడానికి ఇష్టపడడం లేదని, వారు తీవ్ర పరిణామాలను ఎదుర్కోవలసి వస్తుందని అమిత్ షా అనేక సందర్భాల్లో హెచ్చరించారు. ఒకప్పుడు భద్రతా దళాలు అడుగు పెట్టడానికి భయపడే బస్తర్ ప్రాం తంలో మావోయిస్టు ఉద్యమం అంతిమ దశకు చేరుకోవడానికి కారణాలేమిటి? ప్రభుత్వం అనుసరిస్తున్న మూడంచెల వ్యూహమే దీనికి ప్రధాన కారణం.మావోయిస్టుల హింసను అదుపు చేయడానికి కౌంటర్ టెర్రరి జం దళాల ఆపరేషన్‌ను పెద్ద ఎత్తున చేపట్టడంతో పాటు స్థానిక ప్రజలను మావోయిస్టునుంచి దూరం చేయడానికి ప్రభావిత ప్రాంతాల్లో పెద్ద ఎత్తు న అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయడం, లొంగిపోయే మావోయిస్టులకు పునరావాసం కల్పించడం ద్వారా వారిని జనజీవన స్రవంతిలోకి తీసుకు రావడం ఈ వ్యూహంలోని ప్రధాన అంశాలు.ఛత్తీస్‌గఢ్‌లోని బీజే పీ ప్రభుత్వం స్థానిక ప్రజల హక్కులు, భూమి హక్కులను కాపాడడంపై ప్రధానంగా దృష్టిపెట్టడం దీనికి మరింత బలం చేకూరుస్తోంది. 2014 నుంచి ఇప్పటివరకు ఓ వైపు 1700 మందికి పైగా మావోయిస్టులు హతం కాగా, మరోవైపు 6,487 మందిని అరెస్టు చేయడం జరిగింది. 11,413 మంది లొంగిపోయారు. అయితే మావోయిస్టులు కొన్ని ప్రాంతాలకే పరిమితమైన నేపథ్యంలో ఇంత పెద్ద ఎత్తున ఎన్‌కౌంటర్లు జరగడంపై విమర్శ లు వస్తున్నాయి.ఉద్యమం బలహీనమైనందున మావోయిస్టులతో చర్చలకు ఎందుకు ప్రయత్నించడం లేదన్న ప్రశ్నలు కూడా వినిపిస్తున్నాయి. అయితే ప్రభుత్వం ఇప్పు డు చూపిస్తున్న దూకుడును గమనిస్తే చర్చలకు అవకాశమే లేదని అర్థమవుతుంది. గత పదేళ్లలో మొత్తం 343 మంది మావోయిస్టు నేతలు మృతిచెందారు. ఇదే భద్రతా బలగాలకు వరంగా మా రింది. నక్సల్స్‌ను టార్గెట్‌గా చేసుకుని ఏరివేస్తున్నారు. ఛత్తీస్ గఢ్‌లోని కాంకేర్, నారాయణ్ పూర్ అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్ కౌంటర్ లో నలుగురు మావోయిస్టులు మృతి చెందారు. బీనగుండా, పురుష్కోడు అటవీ ప్రాంతంలో ఉత్తర బస్తర్ మాద్ డివిజన్ కమిటీ సభ్యులు ఉన్నారన్న సమాచారంతో బీఎస్ఎఫ్, డీఆర్‌జీ సంయుక్త బలగాలు ఆపరేషన్ చేపట్టాయి. ఈ ఎదురుకాల్పుల్లో నలుగురు మావోయిస్టులు మృతిచెందగా, డీఆర్‌జీ జవాను ఒకరు వీరమరణం పొందారని ఉన్నతాధికారులు తెలిపారు. మావోయిస్టుల మృతదేహాలతో పాటు భారీగా పేలుడు పదార్థాలు, ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు. మావోయిస్టులు రెండు ప్రాంతాల్లో క్యాంపులను ఏర్పాటు చేసుకొని సమావేశం అయ్యారన్న సమాచారంతో పోలీస్ సెర్చ్ ఆపరేషన్ మొదలుపెట్టారు. గురువారం ఉదయం బలగాలకు మావోయిస్టులు ఎదురుపడడంతో ఇరువైపుల నుంచి కాల్పులు కొనసాగాయి. గురువారం మధ్యాహ్నం వరకు కొనసాగిన ఎదురుకాల్పుల్లో ఓ చోట 26 మంది, మరో ఎన్ కౌంటర్ లో నలుగురు మావోయిస్టులు చనిపోయినట్లు బస్తర్ ఐజీ సుందర్ రాజ్ తెలిపారు. వెల్లడించారు.

## హక్కుల కోసం తెలంగాణ నుంచే ఉద్యమ పొలికేక : ఎమ్మెల్సీ కవిత



సిద్దిపేట : హక్కుల కోసం తెలంగాణ నుంచే ఉద్యమ పొలికేక మొదలైందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. బహుజనుల హక్కుల కోసం దేశవ్యాప్తంగా ఉద్యమించాల్సి అవసరం ఉంది. దేశవ్యాప్తంగా బీసీ ఉద్యమంలో తెలంగాణ జాగృతి మొదటి వరుసలో ఉంటుంది అని కవిత పేర్కొన్నారు. కొమురవెల్లి మల్లికార్జున స్వామి వారిని దర్శించుకున్న అనంతరం ఎమ్మెల్సీ కవిత మీడియాతో మాట్లాడారు.బీసీ బిల్లులు ఆమోదం పొందితే మొక్కు చెల్లించుకుంటానని గతంలో ప్రకటన చేశాను. చట్టసభలు బిల్లలు ఆమోదించిన నేపథ్యంలో కొమురవెల్లిలో మొక్కు చెల్లించుకున్నాను. తెలంగాణ జాగృతి, యునైటెడ్ పూలే ఫ్రంట్ డిమాండ్‌కు ప్రభుత్వం తలొగ్గి వేర్వేరు బిల్లును పెట్టింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ బిల్లులు ఆమోదం పొందిన రీత్యా ప్రభుత్వం తదుపరి అడుగు వేయాలి. చట్టాలను కేంద్రం నుంచి ఆమోదించుకొని అమలు చేసేందుకు ప్రణాళిక రూపొందించాలి. రాష్ట్ర చట్టసభలు ఆమోదించిన బిల్లులను కేంద్రం ఆమోదించడానికి ప్రభుత్వం ప్రయత్నించాలి. ఆమోదించిన చట్టాలను ఎవరైనా కోర్టుల్లో సవాలు చేస్తే ప్రభుత్వం గట్టిగా కొట్లాడాలి అని కవిత పేర్కొన్నారు.దేశంలో 50 శాతానికి పైగా రిజర్వేషన్లు కల్పిస్తున్న రాష్ట్రాలు తెలంగాణతో సహా దాదాపు 10 ఉన్నాయి. ఈడబ్ల్యూస్ రిజర్వేషన్లు అమలైన తర్వాత తెలంగాణలో 54 శాతం రిజర్వేషన్లు అమలవుతున్నాయన్న విషయాన్ని ప్రభుత్వం గమనించాలి. రిజర్వేషన్లపై 50 శాతం పరిమితి తొలిగిపోయిన నేపథ్యంలో కోర్టుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం గట్టిగా వాదించాలి. రాజకీయ, విద్యా, ఉద్యోగ రంగాలకు కలిపి ఒకే బిల్లు పెడితే బీసీలకు అన్యాయం జరుగుతుందని తొలి నుంచి వాదిస్తున్నాం అని కవిత తెలిపారు.అసెంబ్లీ అవరణలో మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహాన్ని



ఏర్పాటు చేయాలి. సమాజం పరిణితి చెందుతున్నా కొద్దీ విస్మరించిన వర్గాలు ఒక్క చోటుకు రావాల్సిన అవసరం ఉంది. రాజ్యాంగ హక్కుల కోసం పోరాటం చేయాలి. బీసీ బిల్లులు అంటే.. ఆ ఒక్క వర్గం లొల్లి కాదు? ఇది అందరి లొల్లి అని ఎమ్మెల్సీ కవిత పేర్కొన్నారు.కొమురవెల్లి మలన్నకు ప్రభుత్వం తరపున కేసీఆర్ 130 ఎకరాల మాన్యం భూమిని అందించారు. కేసీఆర్ హయాంలో కనీవినీ ఎరగని రీతిలో అభివృద్ధి జరిగింది. కొమురవెల్లి అభివృద్ధి కోసం బీఆర్ఎస్ హయాంలో చేసిన ఖర్చు రూ 50 కోట్లు. తెలంగాణ రాష్ట్రానికి వరప్రదాయని అయిన ఒక రిజర్వాయర్ కు మలన్న సాగర్ అని పేరు పెట్టుకోవడం జరిగింది అని కవిత గుర్తు చేశారు.

## భారీ లక్ష్యసాధనలో సింగరేణి వెనుకంజ..

### 70 మిలియన్ టన్నుల లక్ష్యసాధన అసాధ్యమే..!

గోదావరిఖని : రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న సింగరేణి సంస్థ 2024-25 ఆర్థిక సంవత్సరంలో నిర్దేశిత బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించే అవకాశాలు ఏమాత్రం కనిపించడం లేదు. భారీ బొగ్గు ఉత్పత్తి లక్ష్యమైన 72 మిలియన్ టన్నులు సాధించేందుకు శతవిధాలా ప్రయత్నించిన సింగరేణి చతికిల పడిపోయింది.మార్చి 21 నాటికి సింగరేణి సంస్థలో 65.90 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి మాత్రమే జరిగింది. ఈ ఆర్థిక సంవత్సరం కేవలం పది రోజులు మిగిలి ఉండడం 10 రోజుల్లో 6.1 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించాల్సిన పరిస్థితి ఏర్పడింది ఇది ఎట్టి పరిస్థితుల్లో సాధ్యమయ్యే అవకాశాలు కనిపించడం లేదు ప్రస్తుత మార్చి నెలలో యావరేజ్‌గా ప్రతిరోజు రెండున్నర లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి మాత్రమే జరుగుతుంది. అంటే మిగిలిన 10 రోజుల్లో కేవలం రెండున్నర మిలియన్ టన్నులు బొగ్గు ఉత్పత్తి సాధించే అవకాశాలతో నిర్దేశిత బొగ్గు ఉత్పత్తి లక్ష్యసాధన సాధ్యం కాదని ఇప్పటికే అధికారులు చేతులెత్తేశారు.గత ఏడాది ఇదే కాలంలో 67.63 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించింది గత ఏడాది కన్నా ఇప్పటికే 17.28 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి వెనుకబడి ఉండడం వల్ల గత ఏడాది సాధించిన 70.02 మిలియన్ టన్నులు కూడా సాధించే అవకాశాలు కనిపించడం లేదు. బొగ్గు ఉత్పత్తి తగ్గడం లాభాలపై ప్రభావం చూపుతుందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. సింగరేణి సంస్థలు బొగ్గు ఉత్పత్తి వెనుకబడినప్పటికీ ఇప్పటికే ఇల్లందు ఏరియా 105% రామగుండం డివిజన్ త్రి ఏరియా 101% బొగ్గు ఉత్పత్తి సాధించడం విశేషం మార్చి నెలలో అధికారులు చేసిన కృషి కారణంగా కార్మికులు అధికంగా కష్టపడడం వల్ల భారీ బొగ్గు ఉత్పత్తి సాధ్యమైంది.మార్చి 1 నుండి 21 వరకు 5215470 టన్నుల లక్ష్యానికి గాను 5814588 టన్నులు (111%) సాధించింది. కార్మికులకు



ప్రవేశపెట్టిన ప్రోత్సాహక బహుమతులు బొగ్గు ఉత్పత్తి మార్చి నెలలో పెరగడానికి కొంత తోడ్పడింది. ఏది ఏమైనా సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి తగ్గడాన్ని సీరియస్ గా పరిగణిస్తూ సింగరేణి యాజమాన్యం సమీక్ష చేస్తుంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన 70 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తిని సాధించిన సింగరేణి సంస్థ ఈ ఆర్థిక సంవత్సరంలో రెండు మిలియన్ టన్నుల అదనపు బొగ్గు ఉత్పత్తి సాధించి 72 మిలియన్ టన్నులు టార్గెట్గా నిర్ణయించింది. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి 68.5 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధ్యమయ్యే అవకాశాలతో వెనుకబడి ఉన్నాం 3.5 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి వల్ల అనుకున్నా ఆదాయం తగ్గి లాభాల్లో సైతం తేడాలు వచ్చే అవకాశం ఉందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

## మహిళా నిరసనకారులను బెదిరించిన బీజేపీ నేత..

కోల్‌కతా: రోడ్డు ప్రారంభోత్సవానికి వెళ్లిన బీజేపీ సీనియర్ నేత పట్ల స్థానిక మహిళలు నిరసన వ్యక్తం చేశారు. దీంతో ఆయన సహనం కోల్పోయారు. గొంతు నొక్కుతానంటూ మహిళలను ఆయన బెదిరించారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. పశ్చిమ బెంగాల్‌లోని పశ్చిమ మెదినీపూర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. మార్చి 21న ఖరగ్‌పూర్‌లోని ఆరో నంబర్ వార్డులో కొత్తగా నిర్మించిన రోడ్డును ప్రారంభించేందుకు బీజేపీ సీనియర్ నేత, మాజీ ఎంపీ దిలీప్ ఘోష్ వెళ్లారు. ఈ సందర్భంగా తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి చెందిన మహిళలు ఆయనను చుట్టుముట్టారు. ఆయన ఎంపీగా ఉన్నప్పుడు ఎక్కడా కనిపించలేదంటూ నిరసన తెలిపారు. తమ కౌన్సిలర్ ప్రదీప్ సర్కార్ ఈ రోడ్డును నిర్మించారని అన్నారు. ప్రారంభోత్సవం కోసం ఆయన రావడంపై మహిళలు మండిపడ్డారు.కాగా, బీజేపీ నేత దిలీప్ ఘోష్ తీవ్రంగా స్పందించారు. మహిళా నిరసనకారులను తృణమూల్ మద్దతుదారులుగా ముద్రించారు. తాను ఎంపీగా ఉన్నప్పుడు ఎంపీలాడ్ నిధులతో ఈ రోడ్డును నిర్మించినట్లు చెప్పారు. 'మీ నాన్న డబ్బులతో కాదు. వెళ్లి ప్రదీప్ సర్కార్‌ని అడగండి' అని అన్నారు.మరోవైపు కొందరు మహిళలు ఆగ్రహించారు. తమ తండ్రి



గురించి ఎందుకు ప్రస్తావించావని దిలీప్ ఘోష్‌ను నిలదీశారు. ప్రజాప్రతినిధివైన నువ్వు ఇలా మాట్లాడవచ్చా? అని ప్రశ్నించారు. దీంతో దిలీప్ ఘోష్ సహనం కోల్పోయారు. 'మీ పద్నాలుగు తరాల గురించి కూడా మాట్లాడతా. అరవకండి. మీ గొంతు నొక్కుతా' అని బెదిరించారు. ఆ మహిళలను 'తృణమూల్ కుక్కలు'గా ఆయన అభివర్ణించారు.అయితే బీజేపీ నేత దిలీప్ ఘోష్ వ్యాఖ్యలతో అక్కడ ఉద్రిక్త పరిస్థితి నెలకొన్నది. ఆగ్రహించిన మహిళలు ఆయన కారును చుట్టుముట్టారు. ఆ వాహనంపై దాడి చేసేందుకు ప్రయత్నించారు. ఇంతలో పోలీసులు అక్కడకు చేరుకోవడంతో ఆయన అక్కడి నుంచి వెళ్లిపోయారు. అయితే ఈ వాగ్వాదానికి సంబంధించిన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.


శ్రీ అయ్యప్ప స్వామి ప్రసన్న: ఓం శ్రీ గురు బసవలింగాయ నమ:


శ్రీ బసవేశ్వర వీరశైవలింగాయతి సంక్షేమ సంఘం మరియు జంగమ ఉమమహేశ్వర సంఘం, ఎమ్మిగనూరు తాలుక వారి ఆధ్వర్యంలో

KIMS హాస్పిటల్ కర్నూలు వారిచే
మన ఎమ్మిగనూరులో...

ఉచిత గుండె, ఏముకలు మరియు చెవి, ముక్కు, గోంతు వైద్య శిబిరం

23 మార్చి 2025, ఆదివారం, ఉ॥ 9 గం॥ల నుండి మ॥ 1 గం॥ల వరకు

స్థలం: అయ్యప్ప స్వామి దేవాలయం, శిల్ప ఎస్టేట్, ఎమ్మిగనూరు.
KIMS కర్నూలు ప్రముఖ వైద్య నిపుణులచే ఉచిత కన్సల్టేషన్.




గుండె సంబంధిత వైద్య సమస్యలు | ఎముకల సంబంధిత వైద్య సమస్యలు | చెవి సంబంధిత వైద్య సమస్యలు

అధ్యక్షులు
జి.బి. నాగరాజు గౌడ్, సెల్ : 6300295181
జి. గూళప్ప, సెల్ : 7989366124

కార్యదర్శి
యన్. మూర్తి సెల్ : 9810690678
అలె ఈరన్న సెల్ : 9966327239

ఇట్లు
శ్రీ బసవేశ్వర వీరశైవలింగాయతి సంక్షేమ సంఘం మరియు జంగమ ఉమమహేశ్వర సంఘం, ఎమ్మిగనూరు.

వివరాలకై సంప్రదించండి
9441612761, 9810690678, 9908336548, 9121299029.


వీరశైవ లింగాయత్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం..

## పచ్చి అబద్దాలు మాట్లాడిన మంత్రి కోమటి రెడ్డి క్షమాపణ చెప్పాలి

### మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి



హైదరాబాద్,తొమ్మిదిన్నరేండ్ల బిఆర్ఎస్ పాలనలో రోడ్లు, భవనాల శాఖ ద్వారా జరిగిన అభివృద్ధి గణాంకాలను చెరిపి వేసే విధంగా మాట్లాడటం సిగ్గు చేటని మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు.బిఆర్ఎస్ పాలనలో నల్లగొండ నియోజకవర్గంకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని నిండు అసెంబ్లీలో మంత్రి కోమటి రెడ్డి పచ్చి అబద్దాలు మాట్లాడారన్నారు. మా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నల్లగొండ నియోజకవర్గంలో 279.5 కోట్లు ఖర్చు చేసి 80.1 కి.మీ రోడ్లు వేసినట్లు గుర్తు చేసారు. సభను, శాసన సభ్యులను తప్పుదోవ పట్టించే తీరు పట్ల స్పీకర్ కి ప్రివిలేష్ మోషన్ ఇస్తామన్నారు. కాంగ్రెస్ నాయకుల తీరు ఎట్లుందంటే, ఎన్నికల సమయంలో అబద్దాలే, బయటా అబద్దాలే, ఇప్పుడు పవిత్రమైన శాసన సభలోనూ పచ్చి అబద్దాలే. అబద్దాలే ఆత్మగా, అబద్ధాలే అంతరాత్మగా 15 నెలల కాంగ్రెస్ పాలన కొనసాగుతన్నదని విమర్శించారు. అబద్దాల ప్రవాహాన్ని కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీలోనూ పారిస్తున్నారు. తొమ్మిదిన్నర ఏళ్ల బిఆర్ఎస్ పాలనలో రోడ్లు భవనాల శాఖ ద్వారా వేసిన రోడ్లు, బ్రిడ్జిల వివరాలను ఒక ప్రకటన ద్వారా విడుదల చేసారు. రాష్ట్ర ఏర్పాటుకు ముందు 24,245 కి.మీ

కొత్తగా 8,578 కిలోమీటర్ల రోడ్ల ఏర్పాటు
ఇందులో రెండు లైన్ల రోడ్లు- 8218 కి.మీ
నాలుగు లైన్ల రోడ్లు-321 కి.మీ.
ఆరు లైన్ల రోడ్లు -39 కి.మీ
ప్రస్తుతం 32,717 కిలోమీటర్ల రోడ్లు.
కొత్త బ్రిడ్జీలు 382

## మార్చి 24 న తల పెట్టిన సాగునీరు త్రాగునీరు ధర్నాను జయప్రదం చేయండి

### కన్వీనర్ కొత్తకాపు శేషాద్రి రెడ్డి

దేవనకొండ మార్చి 22 పందికోన రిజర్వాయర్ కింద ఆయకట్టుకు సాగునీరు త్రాగునీరు గ్రామాలకు అందించాలని ఈ నెల 24 న తలపెట్టిన ధర్నాను జయప్రదం చేయాలని పందికొన రిజర్వాయర్ ఆయకట్టు సాధన సమితి కన్వీనర్ కొత్తకాపు శేషాద్రి రెడ్డి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన శనివారం పాత్రికేయులతో మాట్లాడుతూ రాష్ట్రంలోనే అత్యంత వెనుకబడిన ప్రాంతం కర్నూలు జిల్లా ప్రాంతమైన దేవనకొండ పత్తికొండ ఆస్పరి గోనెగండ్ల ప్రాంతాలన్నారు. పందికోన రిజర్వాయర్ వస్తే తమ కష్టాలు తీరుతాయని ప్రజలు ఎంతో ఆశపడ్డారు అన్నారు. కానీ పరిమితుల సమస్యల వల్ల పందికొన రిజర్వాయర్ లక్ష్యం నెరవేరలేదన్నారు. ప్రజలకు రైతులకు త్రాగునీరు సాగునీరు కోసం చాలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పందికోన రిజర్వాయర్ కింద 61,400 ఎకరాలకు సాగునీరు రావాల్సి ఉన్న కేవలం 10,000 ఎకరాలకు మించి నీరు అందడం లేదన్నారు. మిగతా 51,400 ఎకరాలకు సాగునీరు అందించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.ఈ నెల 24 న ఉదయం 10 గంటలకు రైతులు ప్రజలు పత్తికొండ తహసీల్దార్ కార్యాలయం ముందు జరిగే ధర్నాలో అందరూ పాల్గొనాలని ఆయన కోరారు.

## విజయనగరంలో భారీగా మత్తు టానిక్కు స్వాధీనం

ఈడీ, డ్రగ్ కంట్రోల్ అధికారులు ఆపరేషన్ గరుడ లో భాగంగా విజయనగరంలోని అంబటిసత్రం వద్ద శ్రీవెంకటరత్నం మెడికల్, జనరల్ స్టోర్లో శుక్రవారం రాత్రి సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో భారీగా గడువు ముగిసిన ఔషధాలు, నిషేధిత మత్తు కలిగించే టానిక్కు స్వాధీనం చేసుకున్నామని విజిలెన్స్ శాఖ బర్ల ప్రసాద్ వెల్లడించారు. నిర్వాహకులపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. మెడికల్ షాపుల్లో దొరికే కొన్ని మందులను డ్రగ్స్ గా వినియోగిస్తున్నారని తెలిపారు.

# రాధా... రాం...రాం..

విజయవాడ, మార్చి 22, వంగవీటి రాధా.. ఈ పేరు ఉమ్మడి కృష్ణా, గుంటూరు, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో చాలా ఫేమస్. అందుకు కారణం ఆయన తండ్రి రంగా. కాపుల కోసం ఎన్నో ఉద్యమాలు చేసిన రంగా.. దారుణ హత్యకు గురయ్యారు. ఆ తర్వాత రాజకీయాల్లోకి వచ్చిన రాధా.. ఒక్కసారి ఎమ్మెల్యే అయ్యారు. ఆ తర్వాత ఏ పదవీ రాలేదు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోనే రాజకీయ రాజధాని విజయవాడ. అలాంటి బెజవాడలో రాజకీయంగా చక్రం తిప్పింది వంగవీటి కుటుంబం. వంగవీటి రాధా (రంగా సోదరుడు) హత్య తర్వాత విజయవాడ రాజకీయం పూర్తిగా మారిపోయింది. రంగా ప్రవేశంతో వేడెక్కింది. 1985లో రంగా కాంగ్రెస్ పార్టీ తరఫున ఎమ్మెల్యే అయ్యారు. ఆ తర్వాత జరిగిన పరిణామాల నేపథ్యంలో.. రంగా జైలుకు వెళ్లాల్సి వచ్చింది. రంగా జైల్లో ఉండగానే.. 1988 జులై 10న జరిగిన కాపునాడు సభలో ఆయనను తమ నాయకుడిగా ఎన్నుకున్నారు. ఆ తర్వాత జైలు నుంచి విడుదలైన రంగా.. జనచైతన్య యాత్ర చేసి ఎన్.టి.రామారావు ప్రభుత్వ విధానాలను ఎండగట్టారు. పోలీసులు ఆధిపత్యం చెలాయిస్తున్నారని పోరాడారు. పేదల కోసం, బలహీన వర్గాల కోసం ఆయన అనేక ఉద్యమాలు చేశారు. విజయవాడలోని గిరిపురంలోని పేదల ఇళ్ల పట్టాల కోసం ఆయన నిరాహార దీక్ష చేశారు. కాపు సామాజిక వర్గాన్ని ఏకతాటిపైకి తెచ్చేందుకు ప్రయత్నించారు.1988 డిసెంబర్ 26న పేదల ఇళ్ల పట్టాల కోసం నిరాహార దీక్ష చేస్తున్న రంగాను.. ప్రత్యర్థులు దారుణంగా హత్య చేశారు. ఆయన హత్య తర్వాత కోస్తాంధ్రలో పెద్ద ఎత్తున హింస చెలరేగింది. కేసులు, అరెస్టులు, గొడవలు, ధర్నాలు జరిగాయి. చాలా రోజుల తర్వాత రంగా కుమారుడు రాధా రాజకీయ రంగప్రవేశం చేశారు. 2004లో ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ఆ తర్వాత చిరంజీవి స్థాపించిన ప్రజారాజ్యం పార్టీలో చేరారు2009లో విజయం దక్కలేదు. ఆ తర్వాత కొన్నాళ్లకు జగన్ సారథ్యంలోని వైసీపీలో చేరారు వంగవీటి రాధా. 2014లోనూ అదృష్టం వరించలేదు. 2019 ఎన్నికలకు ముందు టీడీపీలో చేరారు. అప్పుడు ఎక్కడా పోటీ చేయలేదు. పార్టీ అధికారంలోకి వస్తే.. ఎమ్మెల్సీ పదవి ఇస్తారని ప్రచారం జరిగింది. కానీ.. టీడీపీ అధికారంలోకి రాలేదు. ఎమ్మెల్సీ పదవి ఇవ్వలేదు. 2019 నుంచి 2024 వరకూ ఆయన తెలుగుదేశం పార్టీలోనే కొనసాగారు.2024 అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఎక్కడా పోటీ చేయలేదు. కానీ.. పార్టీకోసం ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల్లోని పలు నియోజకవర్గాల్లో ప్రచారం చేశారు. ముఖ్యంగా కాపులు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో రాధా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కూటమి అధికారంలోకి వచ్చింది. ఇక రాధాకు పదవీ ఖాయం అని ఆయన అనుచరులు అనుకున్నారు. మొదటి నామినేటెడ్ పోస్టు వస్తుందని ఆశించారు. రాలేదు.ఆ తర్వాత రాజ్యసభకు పంపుతారనే ప్రచారం జరిగింది. అదీ కుదరలేదు.

ఇక ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాధాకు ఎమ్మెల్యే కోటాలో అవకాశం వస్తుందని ఊహించారు. అదీ జరగలేదు. దీంతో ఆయన అనుచరులు.. తీవ్ర అసంతృప్తితో ఉన్నారనే టాక్ ఉంది. ఇన్నాళ్లుగా ఏ పదవి లేదని.. ఇప్పుడు అధికారంలో ఉన్నా.. ఎందుకు ఇవ్వడం లేదని రాధా అనుచరులు ప్రశ్నిస్తున్నారు.అటు రాధా కూడా ఆయనకు కనీస గౌరవం దక్కలేదని, తన సేవలను గుర్తించలేదని తీవ్ర అసంతృప్తికి లోనవుతున్నట్లుగా తెలుస్తోంది. దీంతో ఏ పార్టీలోకి వెళ్లినా ఇదే పరిస్థితి ఉంటుందని భావించిన రాధా.. రాజకీయాలకు పూర్తిగా గుడ్ బై చెప్పే యోచనలో ఉన్నారని ప్రచారం జరుగుతోంది. ఈ మధ్య రంగా, రాధా మిత్రమండలి సమావేశంలో కూడా తీవ్ర నైరాశ్యంతో మాట్లాడినట్టు సోషల్ మీడియాలో పోస్టులు వచ్చాయి. దీంతో ఆయన రాజకీయాలకు గుడ్ బై చెప్పే ఆలోచనలో ఉన్నారనే వార్తలు చక్కర్లు కొడుతున్నాయి.. 'రాధా రాజకీయాలకు ఎందుకు గుడ్ బై చెప్తారు.. అలాంటిది ఏం లేదు. ఆయన చాలా కంఫర్ట్‌గా ఉన్నారు. రాధాకు ఎప్పుడు ఏ పదవి ఇవ్వాలో పార్టీ నిర్ణయిస్తుంది. అప్పటివరకు ఓపికగా ఉంటాం. కొందరు కావాలని తప్పుడు చేస్తున్నారు. రాధా రాజకీయాల్లోనే ఉంటారు. ఆ మధ్య కాస్త అనారోగ్య సమస్యల వల్ల యాక్టివ్‌గా లేరంతే' అని రాధా మిత్రుడు చెప్పారు.

# ఆత్రేయపురం పూతరేకులకు కల్తీ నెయ్యి



అమలాపురం, మార్చి 22, స్వీట్లలో ఆత్రేయపురం పూతరేకులకున్న పేరు అంతా ఇంతా కాదు. చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు ఇష్టంగా తినే మిఠాయి. నోట్లో పెట్టుకుంటే ఇట్టే కరిగిపోయే పూతరేకులంటే చాలా మందికి మక్కువ. దేశ విదేశాలకు కూగా ఎగుమతి అవుతోన్న ఆత్రేయపురం పూతరేకుల బ్రాండ్‌కు భౌగోళిక గుర్తింపు కూడా దక్కింది. అంతటి పేరున్న ఈ పూతరేకుల్లో కల్తీ రేకులు కూడా చేరుతున్నాయి. పూతరేకుల్లో కల్తీ అనేది కేవలం ఆరోపణలే కాదు. అధికారులు తనిఖీలు చేసి సేకరించిన శాంపిల్స్‌లో కీలకాంశాలు వెలుగు చూశాయి. వీటి తయారీలో వాడిన పదార్థాల్లో కల్తీ అవశేషాలు ఉన్నట్లు పరీక్షల్లో బహిర్గతమైంది. దీంతో ఆత్రేయపురం పూతరేకులంటే ఇష్టపడే స్వీట్ ప్రియులు పూతరేకులు తినాలంటే ముందు వెనుక ఆలోచించే పరిస్థితి వచ్చింది. జరిగిన నష్టాన్ని గ్రహించిన ఆత్రేయపురం పూతరేకుల తయారీ అసోసియేషన్ కీలక నిర్ణయాలు తీసుకుంది. పెద్దలు ఇటువంటి అపకీర్తికి కారణమైన వారిని అసోసియేషన్ నుంచి తొలగిస్తామని హెచ్చరించింది. ఆత్రేయపురం పూతరేకుల్లో కల్తీ పదార్థాలు వాడుతున్నారనే ఆరోపణలతో ఫుడ్ సేఫ్టీ అధికారులు ఫిబ్రవరి 17న నాలుగు బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేశారు. ముడిసరకు అమ్మే దుకాణాల్లో, పాలకోవా తయారీ కేంద్రాల్లో లోకల్‌గా తయారు చేసిన నెయ్యి స్వాధీనం చేసుకున్నారు. దీంతో పూతరేకుల దుకాణాల వద్ద తనిఖీలు చేసి నమూనాలను సేకరించారు. ఇలా సేకరించిన నమూనాలను ల్యాబ్‌కు పంపిస్తేనే కల్తీనా కాదా అనేది నిర్ధారించగలమని అధికారి శ్రీనివాస్ అప్పట్లో చెప్పారు. వాటిని హైదరాబాద్‌లోని ల్యాబ్‌కు పంపించారు. ఇప్పుడు ఆ రిపోర్టులు వచ్చాయి. ఆత్రేయపురంలో సేకరించిన శాంపిల్స్‌లో మూడింటి నమూనాల్లో కల్తీ జరిగినట్లు గుర్తించినట్లు ఆహార భద్రతా అధికారి బి.శ్రీనివాస్ తెలిపారు. ఆత్రేయ డ్రైఫ్రూట్స్ అండ్ నెయ్యి విక్రయదారుడు, శివపార్వతి పాలకోవా, పూతరేకుల తయారీదారులు, షణ్ముక డిస్పోజల్ ముడిసరకు అమ్మకందారుడి నుంచి సేకరించిన శాంపిల్స్‌లో కల్తీ జరిగినట్లు తేలింది. దీనిపై సంబంధిత యజమానులకు నోటీసులు జారీ చేశామని చెప్పారు. ఆత్రేయపురంలో తయారయ్యే పూతరేకుల్లో పలు దుకాణాల్లో కల్తీనెయ్యి వాడుతున్నట్లు గుర్తించిన అధికారులు తయారీ దారులను గట్టిగానే హెచ్చరించారు. బ్రాండ్ ఉన్న నెయ్యిలనే వినియోగించాలని సూచించారు. దీంతో ముడిసరకులు అమ్మే దుకాణదారుల నుంచి ఇకపై నెయ్యి, ఇతర ముడిసరకులు కొనుగోళ్లు ఆపివేయాలని వారంతా నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. అయితే ఆత్రేయపురం పూతరేకుల బ్రాండ్‌ను దెబ్బతీసే విధంగా కల్తీ నెయ్యి, ఇతర ముడిసరకులను విక్రయించిన వారిని శాశ్వతంగా బహిష్కరిస్తామని, పూతరేకుల తయారీదారులు ఈ విషయాన్ని ఎప్పటికప్పుడు గమనిస్తూ జాగ్రత్తలు తీసుకోవాలని వీరి అసోసియేషన్ సూచించింది..

# చెరువుల తవ్వకాలకు బ్రేక్...

కాకినాడ, మార్చి 22,ఒకప్పుడు ఆహ్లాదకరమైన సువిశాల సాగర తీరం ఉండేది. సునామీ, తుపాన్లు వంటి విపత్తుల నుంచి కాపాడేలా ఇసుక తెన్నెలు పుష్కలంగా కనపడేవి. కానీ ఇప్పుడు కనుచూపు మేరలో చెరువులే కనిపిస్తున్నాయి. తీరం వెంబడి పచ్చని గోడలా సరుగుడు తోటలతో గ్రీన్ బెల్ట్ ఉండేది. కానీ ఇప్పుడు మొత్తం ఆక్వా కాలుష్యంతో నిండిపోయింది. ఏకంగా సముద్రానికి ఆనుకుని మరీ చెరువులు తవ్వేయడం ఆందోళనకరంగా మారింది. ఈ అక్రమ కార్యకలాపాల వల్లనే సముద్రకోతకు గురి అవుతోంది. సీఆర్‌జడ్ పరిధి నానాటికీ ముందుకు చొచ్చుకు వచ్చే పరిస్థితి ఉత్పన్నమైంది. విచిత్రమేంటంటే సీఆర్‌జడ్ పరిధిలోకి వచ్చే ఈ ఆక్వా చెరువులకు ఎటువంటి అనుమతులు లేవు. అయినా ప్రభుత్వం అందించే సబ్సిడీ విద్యుత్తు సరఫరా పుష్కలంగా లభిస్తోంది. ఆక్వా చెరువుల దందాపై కొందరు జాతీయ గ్రీన్ ట్రైబ్యునల్‌ను ఆశ్రయించారు. దీంతో గ్రీన్ ట్రైబ్యునల్ సభ్యులు అంబేద్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండల పరిధిలోని అంతర్వేదిలో పర్యటించారు. స్వయంగా అక్కడ జరిగే అక్రమాలను సభ్యులు పరిశీలించారు. తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. తీరం వెంబడి అక్రమంగా తవ్వేసిన ఆక్వా చెరువులను ధ్వంసం చేసి పూడ్చాలని ఆదేశించారు. లేకుంటే స్థానిక అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. స్పందించిన జిల్లా యంత్రాంగం ఆదిశగా చర్యలకు ఉపక్రమించింది.ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో అంతర్వేది నుంచి తుని మండలం అద్దరిపేట వరకు సముద్ర తీరం విస్తరించి ఉంది. ఇందులో అంబేద్కర్ కోనసీమ జిల్లావ్యాప్తంగా విస్తరించి ఉన్న సముద్రతీరం వెంబడి విచ్చలవిడిగా చెరువులు తవ్వకాలు చేసి ఆక్వాసాగు చేస్తున్నారు. ప్రధానంగా అంతర్వేది గ్రామ పరిధిలో తీరప్రాంతం మొత్తం ఆక్వాసాగుగా మారిపోయింది. ఈ చర్యల వల్ల భారీగా తీరం కోతకు గురవుతోంది. ఈ అక్రమ ఆక్వా చెరువులపై జిల్లా అధికారులకు ఎన్నోసార్లు ప్రజలు ఫిర్యాదు చేశారు. చెరువులు ధ్వంసం చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రయోజం లేకపోవడంతో రాజోలు ప్రాంతానికి చెందిన ఎన్ఆర్ఐ యనుమల రాజా గ్రీన్ ట్రైబ్యునల్‌లో పిటిషన్ వేశారు. హైకోర్టును కూడా ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన ట్రైబ్యునల్ క్షేత్రస్థాయిలో పరిశీలనకు ఆదేశాలు జారీ చేసింది. జాతీయ గ్రీన్ ట్రైబ్యునల్ బృందం ఈ ప్రాంతాన్ని పరిశీలించింది. అంతర్వేది సముద్ర తీరం మొత్తం ఆక్వాపరం కావడంతో ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. ఇప్పుడు తాజాగా జిల్లా కలెక్టరు, ఎస్పీలకు ఆక్వాచెరువులను ధ్వంసం చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఉత్తర్వులు జారీ చేయడంతో అధికారులు తక్షణ చర్యలకు ఉపక్రమించారు. అయితే కొందరు దీనిని అడ్డుకోవడంతో అధికారులు భారీ పోలీసు బందోబస్తుతో చెరువుల ధ్వంసం చేస్తున్నారు. అంతర్వేది సముద్రతీర ప్రాంతంలోనే కాకుండా అంబేద్కర్ కోనసీమ, కాకినాడ జిల్లాల పరిధిలోని తీరం వెంబడి ఉన్న ఆక్వాచెరువులు ధ్వసం చేయాలని డిమాండ్ వినిపిస్తోంది. కోనసీమవ్యాప్తంగా సఖినేటిపల్లితోపాటు మలికిపురం, మామిడికుదురు, అల్లవరం, కాట్రేనికోన, ముమ్మిడివరం, ఐ.పోలవరం, తాళ్లరేవు మండలాల పరిధిలో తీరానికి ఆనుకుని ఉన్న అక్రమ ఆక్వాచెరువులు ధ్వంసం చేయాలని పర్యావరణవేత్తలు డిమాండ్ చేస్తున్నారు..

# విశాఖపట్టణం కోసం మాస్టర్ ప్లాన్

విశాఖపట్టణం, మార్చి 22,విశాఖపట్నం.. వేగంగా అభివృద్ధి చెందే నగరం. అందుకే ప్రభుత్వం వైజాగ్‌పై స్పెషల్ ఫోకస్ పెట్టింది. తాజాగా మంత్రి నారాయణ విశాఖ కొత్త మాస్టర్ ప్లాన్‌పై రివ్యూ చేశారు. ఈ సందర్భంగా కీలక నిర్ణయం తీసుకున్నారు. 4 నెలల్లో కొత్త మాస్టర్ ప్లాన్ రూపొందించనున్నట్టు స్పష్టం చేశారు.నాలుగు నెలల్లో విశాఖపట్నం మహా నగరపాలక సంస్థ కొత్త మాస్టర్ ప్లాన్ తయారు చేస్తామని.. పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ వెల్లడించారు. విశాఖ కొత్త మాస్టర్ ప్లాన్‌పై సచివాలయంలో ఆయన అధికారులు, విశాఖపట్నం ఎమ్మెల్యేలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడారు.

'మే నెలాఖరులోగా విశాఖపట్నం మెట్రో రైలు టెండర్లు పూర్తి చేయాలని నిర్ణయించాం. ఫైనాన్షియల్ సిటీ విశాఖ మాస్టర్ ప్లాన్‌పై సమీక్ష నిర్వహించాం. ప్రజలు, నేతల అభిప్రాయాలతో నాలుగు నెలల్లో కొత్త మాస్టర్ ప్లాన్ రూపొందిస్తాం. విశాఖ మెట్రో రైల్‌పైనా సమావేశంలో చర్చించాం. టీడీఆర్ బాండ్ల విషయంలో గతంలో అక్రమాలు జరిగాయి. విశాఖలో 600కు పైగా టీడీఆర్ బాండ్లు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిని విశాఖ కలెక్టర్ త్వరగా క్లియర్ చేయాలని ఆదేశించాం. భోగాపురం విమానాశ్రయానికి ఇబ్బంది లేకుండా రోడ్లు ఏర్పాటు చేస్తాం. వైసీపీ హయాంలో మాస్టర్ ప్లాన్‌కు విరుద్ధంగా డీవియేషన్ జరిగింది' మంత్రి నారాయణ ఆరోపించారు.

6 ముఖ్యమైన అంశాలు..

1.విశాఖపట్నం అభివృద్ధికి వీఎంఆర్‌డీఏ కొత్త విజన్‌ను రూపొందించింది.

2.విశాఖపట్నంలో ట్రాఫిక్ సమస్యను తగ్గించడానికి కొత్త మాస్టర్ ప్లాన్‌ను రూపొందిస్తున్నారు.

3.విశాఖపట్నం, విజయనగరం జిల్లాలకు చెందిన ఎమ్మెల్యేలు ఇటీవల అసెంబ్లీలో రోడ్ల అభివృద్ధి గురించి ప్రశ్నలు వేశారు.

4.విశాఖపట్నం మాస్టర్ ప్లాన్‌లో అవకతవకలు జరిగాయని, 4 నెలల్లో కొత్త మాస్టర్ ప్లాన్ రెడీ చేస్తామని మంత్రి నారాయణ చెప్పారు.

5.విశాఖపట్నం మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) రూపొందించి, అమలు చేస్తున్న మాస్టర్ ప్లాన్-2041పై కొత్త ప్రభుత్వం దృష్టిసారించింది.

6.విశాఖపట్నం, భీమునిపట్నం, భోగాపురం, విజయనగరం, అనకాపల్లి, అచ్యుతాపురం తదితర ప్రాంతాల్లో వందలాది ఎకరాలు కొనుగోలు చేసిన వైసీపీ నేతలు వాటికి భవిష్యత్తులో మేలు జరిగేలా మాస్టర్ ప్లాన్‌ను మార్చుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

విశాఖ అభివృద్ధికి ఏం చేయాలి..

మెరుగైన రహదారులు, వంతెనలు, ప్రజా రవాణా వ్యవస్థను నిర్మించాలి. నీటి సరఫరా, మురుగునీటి పారుదల, విద్యుత్ వంటి ప్రాథమిక సదుపాయాలను మెరుగుపరచాలి. విమానాశ్రయం, ఓడరేవులను విస్తరించాలి. ఐటీ, ఫార్మాస్యూటికల్స్, పర్యాటక రంగాలను అభివృద్ధి చేయడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ప్రోత్సహించడానికి రాయితీలు, ప్రోత్సాహకాలు అందించాలి. విశాఖపట్నాన్ని ఒక ఆర్థిక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకోవాలి.

ప్రోత్సాహం ఇవ్వాలి..

విశాఖపట్నం సహజ అందాలను, చారిత్రక ప్రదేశాలను ప్రోత్సహించడానికి చర్యలు తీసుకోవాలి. పర్యాటకుల కోసం మెరుగైన వసతి, రవాణా సౌకర్యాలు కల్పించాలి. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయాలి. విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో పరిశోధన, అభివృద్ధిని ప్రోత్సహించాలి. కాలుష్యాన్ని తగ్గించడానికి, పర్యావరణాన్ని పరిరక్షించడానికి చర్యలు తీసుకోవాలి. చెట్లు నాటడం, పచ్చదనాన్ని పెంచడం వంటి కార్యక్రమాలు చేపట్టాలి. అప్పుడు విశాఖ తొందరగా అభివృద్ధి చెందుతుందని నిపుణులు చెబుతున్నారు.

# టీడీపీ గూటికి రాపాక



విజయవాడ, మార్చి 22, జనసేన పార్టీ తొలి ఎమ్మెల్యేగా నెగ్గి తెలుగు రాష్ట్రాల్లో ఒక్కసారిగా గుర్తింపు పొందిన రాజోలు మాజీ ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు ప్రస్తుతం దారెటు..? ఆయన ఏ పార్టీ వైపు చూస్తున్నారు. ఇప్పుడు కోనసీమలో ఇదే చర్చ జరుగుతోంది. ఎందుకంటే ఆయన కదలికలు గమనిస్తున్న పలువురు ఆయన టీడీపీ నాయకులతో టచ్‌లో ఉన్నారననే టాక్ ఆసక్తిగా మారింది. రాజోలు నియోజకవర్గంలో టీడీపీకి సరైన నాయకుడు లేకపోవడం ఈ ప్రచారనికి మరో కారణంగా కనిపిస్తోంది. రాజోలులో వ్యక్తిగత ఓటు బ్యాంకు కలిగిన నాయకునిగా గుర్తింపు ఉన్న రాపాక వరప్రసాదరావుకు ఇప్పుడు ఇదే అంశం కలిసొచ్చే అవకాశాలున్నాయని పొలిటికల్ సర్కిల్‌లో చర్చ జరుగుతోంది. రాజోలు నియోజకవర్గంలో టీడీపీ ఇంచార్జ్‌గా ఉన్న గొల్లపల్లి సూర్యారావు మొన్నటి సాధారణ ఎన్నికలకు ముందు టీడీపీకి షాకు ఇచ్చి వైసీపీలో చేరి టిక్కెట్టు దక్కించుకున్నారు. 2019 ఎన్నికల్లో రాష్ట్రంలో జనసేన పార్టీకి ఏకైన ఎమ్మెల్యేగా గెలుపొందిన రాపాక జనసేనకు షాక్ ఇచ్చి వైసీపీలో గూటికి చేరారు. 2024లో వైసీపీ టికెట్టు తనదే అనుకున్న సమయంలో ఎన్నికలకు ముందు వైసీపీలో చేరిన గొల్లపల్లికి అసెంబ్లీ టికెట్టు ఇచ్చి రాపాకకు వైసీపీ షాక్ ఇచ్చింది. అయితే అమలాపురం ఎంపీ టికెట్టు ఇచ్చినా అయిష్టతతోనే ఆయన పోటీలో ఉండాల్సిన పరిస్థితి తలెత్తింది. ఎన్నికల అనంతరం ఆయన జగన్‌పై తీవ్ర విమర్శలు చేస్తూ వైసీపీకు గుడ్‌బై చెప్పారు. గొల్లపల్లి వైసీపీకి వెళ్లిపోవడంతో అప్పటి నుంచి రాజోలులో టీడీపీకి నాయకుడు లేడు. ఇప్పుడు రాపాక చూపులు టీడీపీ వైపు పడటం వెనుక కారణమిదే అంటున్నారు. రాజోలులో టీడీపీకి ఇంచార్జ్ లేకపోవడం రాపాకకు కలిసొచ్చే అంశమని, రాపాక రాకకు మార్గం సుగమం అవుతుందంటున్నారు. మొన్నటి సాధరణ ఎన్నికల తరువాత వైసీపీకి గుడ్‌బై చెప్పిన రాపాక వరప్రసాదరావు టీడీపీ కీలక నేతలతో టచ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ మధ్య కాలంలో రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, యనమల రామకృష్ణుడు, ఎమ్మెల్యేలు నిమ్మకాయల చినరాజప్ప, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఆదిరెడ్డి వాసు తదితరులను కలిసినట్లు టాక్. ప్రస్తుతం రాపాక ఎటూ వెళ్లక సైలెంట్‌గా ఉన్నా కూడా ఆయన మాత్రం టీడీపీలోకి చేరేందుకు అన్ని ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నారని మాత్రం స్థానికంగా తీవ్రంగా చర్చజరుగుతోంది..

# పోసాని చుట్టూ కేసుల వలయం

గుంటూరు మార్చి 22,పోసాని కృష్ణమురళికి సీఐడీ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో పోలీసులు ఇప్పటికే ఆయనను ఓ రోజు కస్టడీకి తీసుకుని విచారించారు. బెయిల్ పిటిషన్ దాఖలు చేయడంతో విచారణ జరిపిన కోర్టు బెయిల్ మంజూరు చేసింది. మార్ఫింగ్ ఫోటోలు చూపించి చంద్రబాబు,లోకేష్, పవన్ లను దూషించిన వ్యవహారంపై ఆయనపై ఓ టీడీపీ నాయకుడు కేసు పెట్టారు. సమాజంలో వర్గాల మధ్య ద్వేషాన్ని పెంచి అల్లర్లు చెలరేగే కుట్ర చేశాడన్న కారణంగా ఆయనను అరెస్టు చేశారు. ఇప్పటికే ఆయనపై ఇతర కేసులు చాలా ఉన్నాయి. వాటిలో ఆయనకు బెయిల్ మంజూరు అయింది. ఇక కర్నూలు జైలు నుంచి విడుదల అవుతారు అనుకున్న సమయంలో సీఐడీ పోలీసులు పీటీ వారెంట్ పై అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. సీఐడీ కోర్టులో హాజరుర పరిచినప్పుడు 70 ఏళ్ల వయసులో తనను అనేక ప్రాంతాల్లో తిప్పుతున్నారని... అసలు ఎన్ని కేసులు



ఉన్నాయో చెప్పడంలేదని వాపోయారు. అన్యాయంగా వాదనలు వినిపిస్తున్న పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు తనకు లైడిటెక్టర్ పరీక్షలు నిర్వహించాలని కోర్టుకు విన్నవించుకున్నారు. తనకు ఆరోగ్యం సరిగా లేదని ఇప్పటికే రెండుసార్లు స్టంట్లు వేశారని గొంతు చికిత్స కూడా జరిగిందని ఆరోగ్యం సహకరించడం లేదని పోసాని న్యాయమూర్తికి చెప్పుకున్నారు. తాను తప్పు చేసినట్టు తేలితే నరికేయాలని కోరారు. రెండు రోజుల్లో బెయిల్ ఇవ్వకపోతే ఆత్మహత్య చేసుకుంటాన్నారు.పోసానిపై ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా 30కిపైగా ఫిర్యాదులు వచ్చాయి. అందులో 17 కేసులు నమోదు అయ్యాయి. ఫిబ్రవరి 26న అన్నమయ్య జిల్లా ఓబులవారిపల్లె పీఎస్‌లో నమోదైన కేసులో ఆయన అరెస్ట్ చేశారు. అప్పట్నుంచి రాష్ట్రంలోని పలు పోలీస్ స్టేషన్లకు తిరుగుతూనే ఉన్నారు. ఇంకా పోసానిపై ఇంకా అనేక చోట్ల కేసులు నమోద అయి ఉన్నందున ఆయనను ఏ జిల్లా నుంచి అయినా పోలీసులు వచ్చి పీటీ వారెంట్‌తో అదుపులోకి తీసుకుంటారా లేకపోతే విడుదలవుతారా అన్న ఉత్కంఠ ఏర్పడింది. ఏ పోలీస్ స్టేషన్ నుంచీ ఎవరూ పీటీ వారంట్ తో రాకపోతే శనివారం ఉదయం పోసాని విడుదలయ్యే అవకాశం ఉంది. పోసాని కృష్ణమురళి వైసీపీలో అత్యంత అసభ్యంగా మాట్లాడే నేతగా గుర్తింపు తెచ్చుకున్నారు. గతంలో ఆయనపై కోర్టులు కూడా కేసులు పెట్టాలని ఆదేశించాయి. నారా లోకేష్ మంగళగిరి కోర్టులో ప్రైవేటు పిటిషన్ కూడా దాఖలు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా ఆయన అదే భాషను కొనసాగించారు. అయితే పలు చోట్ల కేసులు నమోదు కావడంతో తూచ్ అన్నారు. తనకు ఇక రాజకీయాలతో సంబంధం లేదని ప్రకటించారు

# ఆపరేష్ గరుడ...

కడప మార్చి 22, ఏపీలో మెడికల్ షాపులపై అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. ఆపరేషన్ గరుడలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా మెడికల్ షాపులపై దాడులు జరుగుతున్నాయి. మెడికల్ షాపులతో పాటు ఏజెన్సీలపైనా దాడులు కొనసాగిస్తున్నారు. ఈగల్ టీమ్, విజిలెన్స్ అండ్ ఎన్ ఫోర్స్ మెంట్, లోకల్ పోలీసులతో పాటు డ్రగ్ కంట్రోల్ బృందాలు సంయుక్తంగా సోదాలు చేపడుతున్నారు. దాదాపు 100 బృందాలు ఏపీ వ్యాప్తంగా తనిఖీలు, దాడులు చేస్తున్నాయి. విజయవాడ, నెల్లూరు, శ్రీకాకుళం, శ్రీసత్యసాయి జిల్లాలతో పాటు ఇతర జిల్లాల్లోనూ ఈ దాడులు కొనసాగుతున్నాయి.ఆపరేషన్ గరుడలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా మెడికల్ షాపుల్లో విస్తృత తనిఖీలు చేపట్టారు. విశాఖపట్నం, నెల్లూరు, అనంతపురం, కడప, ఒంగోలు, విజయవాడల్లో విజిలెన్స్, ఈగల్, డ్రగ్ అధికారులు సోదాలు నిర్వహించారు. దాదాపు 100కు పైగా బృందాలతో మెడికల్ షాపుల్లో తనిఖీలు చేశారు. డాక్టర్ ప్రిస్కిప్షన్ లేకుండా మందులు అమ్ముతున్న మెడికల్ షాపు నిర్వాహకులపై కేసులు నమోదు చేశారు.కాలం చెల్లిన మందులు విక్రయిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. డ్రగ్స్‌కు సంబంధించి ఎటువంటి సమాచారం ఉన్నా.. 1912 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చని అధికారులు సూచించారు. ఆపరేషన్ గరుడ అనేది ఆంధ్రప్రదేశ్ లోని వివిధ నేరాలను అరికట్టడానికి ఉద్దేశించిన ఒక కార్యక్రమం. ఇది ప్రధానంగా రెండు అంశాలపై దృష్టి పెడుతుంది.ఆంధ్రప్రదేశ్‌లో డ్రగ్స్ వాడకం, అమ్మకం పెరగడం వల్ల యువత చెడిపోతున్నారు. దీనిని అరికట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం "ఆపరేషన్ గరుడ" పేరుతో ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించింది.

# పేదరికాన్ని నిర్మూలించడమే పి4 విధానం

## ఖజానా కార్యాలయంలో తనిఖీలు



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మార్చి 22 - ఉమ్మడి కర్నూలు జిల్లాలో నిర్వహించిన వార్షిక తనిఖీ కార్యక్రమంలో భాగంగా ఖజానా శాఖ సంచాలకులు యన్. మోహన్ రావు విచ్చేసి వివిధ అంశాలను సమీక్షించారు. వార్షిక తనిఖీ ప్రక్రియలో భాగంగా ట్రేజరీ నిర్వహణ, అకౌంటింగ్ విధానాలు, పింఛన్ వ్యవస్థ మరియు ఇతర నిధుల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ ట్రేజరీ అధికారులతో సమావేశమై విధానపరమైన సూచనలు, మార్గదర్శకాలను అందించారు. ప్రభుత్వ నిధుల పారదర్శకతను మెరుగుపరచడం,కార్యాలయవిధుల్లోఆధునిక సాంకేతికత వినియోగాన్ని పెంచడం మరియు లావాదేవీల వేగాన్ని పెంచేలా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తనిఖీ అనంతరం, డైరెక్టర్ అనూహ్యంగా నంద్యాల సబ్ ట్రేజరీ కార్యాలయాన్ని కూడా సందర్శించారు. అక్కడి అధికారులతో సమావేశమై కార్యాచరణను సమీక్షించారు. సబ్ ట్రేజరీ లో విధుల నిర్వహణ, పింఛన్ చెల్లింపులు, ప్రభుత్వ ఉద్యోగులజీత భత్యాల వ్యవస్థ నిర్వహణ తదితర విషయాలను పరిశీలించి, అధికారులకు పలు మార్గదర్శకాలను అందించారు. మరియు జిల్లా కలెక్టరు గారిని మర్యాద పూర్వకంగా కలిసి జిల్లా ఖజానా కార్యాలయ భవన స్థల కేటాయింపు విషయమై చర్చించడం జరిగింది.

## తగినంత సిబ్బంది లేక ఇబ్బందులు

### మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి



--విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మార్చి 22 - శానిటేషన్ సిబ్బంది తగినంత లేక ఇబ్బందులు పడుతున్నామని మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయం లో శనివారం ఆయన మాట్లాడుతూ నంద్యాల మున్సిపాలిటీ యందు పారిశుధ్య కార్మికులు తగినంత లేక పోవడంతో ఇబ్బందులు పడుతున్నామని కమిషనర్ అన్నారు. పర్మినెంటు కార్మికులు 113 మంది. టెంపరరీగా 321 మంది పారిశుధ్య కార్మికులు ప్రతి రోజూ పనిచేస్తున్నారని తెలిపారు. గతంలో డ్రైనేజీ యందు పూడిక పనుల కోసం స్పెషల్ గా 60 మంది కార్మికులను ఆరు నెలల పాటు పనిచేయుటకు తీసుకున్నట్లు తెలిపారు . చెత్త సేకరణ కోసం రెండు పెద్దవి రెండు చిన్న వి కంటైనర్లు. రెండు ఆల్విన్లు . ఎనిమిది టాక్టర్లు ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం 31 క్లాప్ ఆటోలను కేటాయించిన వారికి జీతాలు ఇవ్వనందుకు అవి మూలన పడ్డాయన్నారు . రెండు టాక్టర్లు పాత వి పనిచేయడం లేదన్నారు . నంద్యాల డివిజన్ స్థాయి నుంచి జిల్లా స్థాయి కావడంతో పట్టణంలో శివారు కాలనీలు దాదాపు 16 వెలిశాయని జనాభా కు తగిన విధంగా . పారిశుధ్య కార్మికులు. చెత్త సేకరణ వాహనాలు లేకపోవడంతో పారిశుధ్య పనుల వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అన్నారు. ప్రభుత్వం సరిపడు పారిశుధ్య కార్మికులను చెత్త సేకరణ వాహనాలను కేటాయించిన యెడల పట్టణంలో పారిశుధ్యం పై ఎటువంటి ఇబ్బందులు ఉండవని ఆయన అన్నారు.

## పరిమితికి మించి ప్రయాణికులతో వెళ్తే చర్యలు

### ట్రాఫిక్ సీఐ మల్లికార్జున గుప్తా

--విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మార్చి 22 - ఆటోల్లో పరిమితికి మించి వ్యవసాయ కూలీలను ఎక్కించుకుంటే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ సీఐ మల్లికార్జున గుప్తా ఆటో డ్రైవర్లు, యజమానులను హెచ్చరించారు. శనివారం మున్సిపల్ టౌన్ హాల్ నందు ఆటో డ్రైవర్లు, యజమానులకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలన్నారు. బీమా, లైసెన్సులు కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.



### జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మార్చి 22 - పేదరికాన్ని నిర్మూలించడమే పీ-4 (ప్రభుత్వ-ప్రైవేట్-ప్రజల-భాగస్వామ్య) వ్యవస్థ లక్ష్యమని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అన్నారు. శనివారం కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాలులో స్వర్ణాంధ్ర 2047 విజన్ ప్లాన్ లో భాగంగా పేదరిక నిర్మూలనకు పి4 (ప్రభుత్వ- ప్రైవేటు- ప్రజల-భాగస్వామ్య) విధానంపై చర్చ, అభిప్రాయ సేకరణపై సమావేశం నిర్వహించారు. డిఆర్ఓ రామునాయక్, సిపిఓ వేణుగోపాల్, జిల్లా అధికారులు, ఎంపీటీసీలు జడ్పిటిసిలు, ఇతర ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు, ఎన్జీఓ సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ స్వర్ణాంధ్ర 2047 విజన్ ప్లాన్ లో భాగంగా పేదరిక నిర్మూలనకు పి4 విధాన కార్యచరణ ప్రణాళిక రూపకల్పనకు ప్రజలు, ప్రజాప్రతినిధులు, వివిధ సంస్థల ప్రతినిధుల నుండి అభిప్రాయాలు సేకరిస్తున్నామని తెలిపారు. అందరి అభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని చక్కటి కార్యాచరణ ప్రణాళిక రూపొందించి ప్రభుత్వానికి నివేదిస్తే రాష్ట్ర ముఖ్యమంత్రి ఉగాది పండుగ రోజు లాంఛనంగా ప్రారంభిస్తారన్నారు. ఇందుకోసం రాబోయే ఐదు సంవత్సరాలలో జిల్లాను అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు ఏ విధంగా ముందుకు తీసుకెళ్లగలమో అన్న అంశాలపై అభిప్రాయాలు సేకరిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. గతంలో మండల, నియోజకవర్గ, జిల్లా అభివృద్ధి ప్రణాళికలను ప్రభుత్వానికి నివేదించడం జరిగిందన్నారు. జిల్లా అభివృద్ధిలో ఆర్థిక, ఆర్థికేతర అంశాలు ఉంటాయని.... ఆర్థిక అంశాలలో పి4 విధానాన్ని ప్రవేశపెట్టి జిల్లాను అభివృద్ధి చేయాలనేది రాష్ట్ర ముఖ్యమంత్రి ఆలోచన అన్నారు. సమాజంలో పేదలు, నిరుపేదలు, మధ్యతరగతి, ఉన్నత వర్గాలవారు ఉంటారని... అట్టడుగున ఉన్న 10 శాతం నిరుపేదలను ఉన్నత స్థాయిలో ఉన్న 20 శాతం సంపన్నులు వ్యక్తిగతంగా కాని, కుటుంబ పరంగా, సామాజిక పరంగా ఏ విధంగా సహాయ సహకారాలు అందించగలరో సంబంధిత వ్యక్తులు/సంస్థలు ముందుకు వస్తే పి4 విధానంలో భాగస్వాములను చేస్తామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో 5.97 లక్షల కుటుంబాలలో 20 లక్షల మంది జనాభా నివసిస్తున్నారని, ఇందులో 15 లక్షలు గ్రామీణ ప్రాంతాలలో, 5 లక్షల జనాభా పట్టణ ప్రాంతాలలో ఉన్నారన్నారు. సచివాలయ సెక్రెటరీ, వార్డ్ అమెనిటి సెక్రటరీలతో కుటుంబ సభ్యుల అంగీకారం తీసుకొని అన్ని కుటుంబాలను సర్వే నిర్వహించి 4.5 లక్షల కుటుంబాలు పేదరికంలో ఉన్నట్లు గుర్తించామన్నారు. ఈ సర్వేలో గతంలో తీసుకున్న ఏ ప్రభుత్వ పథకం రద్దు కాదని, కొత్త స్కీములో అర్హత ఉంటే కచ్చితంగా చేరుస్తామని ప్రజలలో వున్న అపోహలన్నీ తొలగించి సర్వే చేపట్టామన్నారు

## పోలీస్ సిబ్బందికి రేడియం జాకెట్ల పంపిణీ

### : జిల్లా ఎస్పీ అదిరాజ్ సింగ్ రాణా



---విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మార్చి 22 - నంద్యాల జిల్లా ఎస్పీ అదిరాజ్ సింగ్ రాణా నంద్యాల జిల్లాలో రాత్రి వేళలో ప్రజల ప్రాణాలకు మరియు ఆస్తులకు రక్షణ కల్పిస్తూ నిరంతరం గస్తీ నిర్వహిస్తున్న పోలీస్ బ్లూ కోర్స్ సిబ్బందికి ఎలాంటి రహదారి ప్రమాదాలు జరగకుండా రక్షణ కొరకు బ్లూ కలర్ రేడియం జాకెట్స్ ను పంపిణీ చేయడం జరిగింది. హైవేలలో ఏదైనా రోడ్డు ప్రమాదం సంభవించినప్పుడు పోలీసు సిబ్బంది సహాయ చర్యలలో నిమగ్నం కావడం వల్ల ఇతర వాహనాల నుండి వారి రక్షణ కొరకు హైవే పెట్రోలింగ్ సిబ్బందికి ఆరెంజ్ కలర్ రేడియం జాకెట్స్ ను పంపిణీ చేయడం జరిగింది. నంద్యాల జిల్లాలో 24/7 ఎలాంటి చట్ట వ్యతిరేక మరియు అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని సమాచారం వచ్చిన వెంటనే రాత్రి వేళలో రైట్స్ చేయుటకు మరియు రోడ్డు ప్రమాదాల నుండి రక్షణ కొరకు క్యూఆర్టీ సిబ్బందికి గ్రీన్ కలర్ రేడియం జాకెట్స్ ను అందజేయడం జరిగింది. నంద్యాల జిల్లాలో దొంగతనాలు, హత్యాలు, ఆత్మహత్యలు ఇలా ఏ నేరం జరిగిన ముద్దాయిలను కనిపెట్టి వారికి శిక్ష పడే విధంగా చేయడంలో ముఖ్యపాత్ర పోషిస్తున్న క్లూస్ టీం సిబ్బందికి ఎల్లో కలర్ కేడియం జాకెట్స్ ను అందజేయడం జరిగింది. పైన వివరించిన సిబ్బందికి రాత్రి వేళలో మరియు విధులు నిర్వహిస్తున్నప్పుడు ఎలాంటి అపాయాలు,ఆటంకాలు కలగకుండా ఉ ండడం కొరకు మరియు త్వరగా వారిని గుర్తించడం కొరకు ఈ రేడియం జాకెట్స్ ను పంపిణీ చేయడం జరిగిందని జిల్లా ఎస్పీ గారు తెలియజేశారు


## జీవన నైపుణ్యాలపై అవగాహన సదస్సు.



విభారే న్యూస్ మార్చి 22 ఎమ్మిగనూరు..స్థానిక సెయింట్ జాన్స్ ఫార్మసీ కళాశాల జాతీయ సేవా పథ కం ఎన్ఎస్ఎస్ చిన్నయ మిషన్ వారి ఆధ్వర్యంలో జీవన నైపుణ్యాలు" అనే అంశం పై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా. చిన్నయ మిషన్ ప్రెసిడెంట్ (బ్రహ్మచారి.నారాయణ చైతన్య మాట్లాడు తూ ప్రతి విద్యార్థి జీవన నైపుణాలు, ఆలోచనా విధానం ద్వారా. వ్యక్తి గత అభివృద్ధి సాధించి. సమాజ సేవకు. ఉపయోగ పడాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రసిపాల్ డాక్టర్ ఎన్ ఎం. వాగేష్ (ప్రతి విద్యార్థి చదువులో పాట, వ్యక్తిగత, సామాజిక మరియు వృత్తి పరమైన నైపుణ్యాలు పెంపొదిం చుకోవాలిని సూచించారు. ఈ కార్య క్రమంలో ఫార్మసీ కళాశాల (పిస్సిపాల్ డా. (శ్రీనివాసులు, వైస్ ప్రిస్సిపాల్ డా. ఎన్.ఎం. వాగేష్ డే ఎన్ఎస్ఎస్ అధికారులు,బి. రాజశేఖర్,సి. వెంకటేష్,డి. అనంత (ప్రసాద్ కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గోన్నారు.




## పదో తరగతి పరీక్షలకు 8 మంది గైర్హాజరు




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మార్చి 22-: నంద్యాల జిల్లా లో శనివారం నిర్వహించిన పదో తరగతి తెలుగు పేపర్ టు పరీక్షకు 8 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని జిల్లా డీఈవో జనార్ధన్ రెడ్డి ఒ ప్రకటన లో తెలి పారు. నంద్యాల జిల్లా లో 66 పరిక్షా కేంద్రాల్లో 3552 విద్యార్థులకు గాను3544 మంది హాజరయ్యారు. 8 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని డీఈవో తెలిపారు. . జిల్లా వ్యాప్తంగా 7 ఫ్లయింగ్ స్క్వాడ్ టీంలు 17 పరీక్షాకేంద్రాలను మరియు జిల్లా విద్యాశాఖాధికారి 6 పరీక్షాకేంద్రమును సందర్శించారు . మొత్తం 20 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేయడం జరిగిందన్నారు. ఒక సమస్యాత్మక కేంద్రంలో ఒకరిని సిట్టింగ్ స్క్వాడ్ ను ఏర్పాటు చేసి, మరియు 32 మంది సిట్టింగ్ స్క్వాడ్లను జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసి, సజావుగా పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు .

## పట్టణంలోని పారిశుద్ధ్య పనులను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్...



విభారే న్యూస్ మార్చి 22 ఎమ్మిగనూరు..శనివారం రోజున మునిసిపల్ కమిషనర్ ఎన్ గంగిరెడ్డి పట్టణం లోని షరాఫ్ బజార్, శిల్పా కాలనీ, గౌనేగండ్ల రోడ్, సొగనూరు రోడ్ ఏరియా ల యందు నిర్వహిస్తున్న పారిశుధ్య పనులు పరిశీలించడం జరిగింది..

## హైకోర్టు జడ్జిను మర్యాదపూర్వకంగా కలిసిన కలెక్టర్, ఎస్పీ..



విభారే న్యూస్ మార్చి 22 కర్నూలు జిల్లా ప్రతినిధి..నగరం లోని స్టేట్ గెస్ట్ హౌస్ లో హైకోర్టు జడ్జి, కర్నూలు జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ బి.ఎస్. భానుమతిని మర్యాదపూర్వకంగా కలిసిన కర్నూలు జిల్లా ప్రధాన న్యాయమూర్తి కబర్ధి,జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా,ఎస్పీ విక్రాంత్ పాటిల్.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190